సాక్షి చిత్తూరు

ఆదివారం । 12 । మే । 2024



మరింత బాధ్యతగా విధులు

పోలింగ్ సందర్భంగా మరింత బాధ్యతగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు. - 8లో



ప్రచార తు'ఫ్యాన్'

జిల్లాలో శనివారం చివరి రోజు ఎన్నికల ప్రచారాన్ని వివిధ పార్టీల అభ్యర్థులు హోరెత్తించారు. - 8లో



అవగాహనతో విధుల నిర్వహణ

ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవగాహనతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ఆదేశించారు. - 8లో

13న వేతనంతో కూడిన సెలవు

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన పోలింగ్ రోజు ప్రభుత్వేతర సంస్థలు, పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఉత్తర్వులను ఆయా సంస్థల యాజమాన్యాలు తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది.

- రేపే పోలింగ్
- అమల్లోకి 144 సెక్షన్

ప్రచారం.. పరిసమాప్తం

చిత్తూరు కలెక్టరేట్/ చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి తెరపడింది. శనివారం సాయంత్రం 6 గంటలతో ప్రచార పర్వం పరిసమాప్తమైంది. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14వ తేదీ రాత్రి 7 గంటల వరకు 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని ఎన్నికల అధికారులు ప్రకటించారు. సోమవారం పోలింగ్‌ను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే చిత్తూరులో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ క్రమంలోనే



పోలింగ్ సరళిని పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్

జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలు, బార్లు మూతబడ్డాయి. ఈనెల 13వ తేదీ రాత్రి 8గంటల వరకు మద్యం దుకాణాలు, బార్లు మూసేయాల్సిందే అని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ జిల్లా అధికారి షేక్ ఆయేషాబేగం స్పష్టం చేశారు. చిత్తూరు నగరంలో పెద్ద సంఖ్యలో స్థానికేతరులను టీడీపీ నేతలు రప్పించినట్లు సమాచారం. పొరుగు రాష్ట్రాల నుంచి వేలాది మందిని తీసుకువచ్చి దొంగ ఓట్లు వేయించేందుకు ప్రణాళిక రచించినట్లు తెలిసింది. దీనిపై పోలీసులు దృష్టి సారించి స్థానికేతరులను జిల్లా వెలుపలకు పంపించాల్సిన అవసరముంది. అలాగే టీడీపీ నేతలు




మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

ఓటర్లను ప్రలోభపెట్టేందుకు టీడీపీ నేతలు విచ్చలవిడిగా మద్యం, నగదు పంపకాలు చేపట్టారు. కర్ణాటక నుంచి భారీగా మద్యం తీసుకువచ్చి ఇక్కడి ఓటర్లను మత్తులో ముంచుతున్నారు.

మూడో ర్యాండమైజేషన్ పూర్తి

జిల్లాలో మూడో ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో అబ్జర్వర్‌లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొత్తం ప్రక్రియ నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి వెంట తెచ్చుకుని ఓటు వేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో అబ్జర్వర్‌లు షాదిక్ అలం, శంకర్‌ప్రసాద్‌శర్మ, చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మోసాలకు కేరాఫ్ థామస్



డాక్టర్ రమ్య ఫొటో చూపుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం : టీడీపీ జీడీనెల్లూరు అభ్యర్థి థామస్ ఆడబిడ్డల అండాశయాలతో వ్యాపారం చేసే రాక్షసుడని, మోసాలకు కేరాఫ్ అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి విమర్శించారు. శనివారం పుత్తూరులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజకీయంగా ఎదుర్కోలేకే థామస్ తనపై బురదజల్లేందుకు విఫలయత్నం చేస్తున్నారన్నారు. డాక్టర్ అని చెప్పుకుంటూ ప్రజలను ఏమారుస్తున్నారని, అందులో భాగంగానే మునస్వామి అనే పేరును థామస్‌గా మార్చుకున్నారని స్పష్టం చేశారు. గొప్ప శాస్త్రవేత్త పేరును అంట గట్టుకుని నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. నిజమైన డాక్టర్ అయితే ఎన్నికల అఫిడవిట్‌లో ఎందుకు పొందుపర్చలేదని ప్రశ్నించారు. రమ్య అనే డాక్టర్‌ను చంపేందుకు థామస్ ప్రయత్నించేశారని, త్వరలోనే ఆమెను మీడియా ముందుకు తీసుకువచ్చి మొత్తం బండారం బయటపెడతామని తెలిపారు. థామస్ ఎలాంటి నేరం చేయలేదని దమ్ముంటే చర్చిలో ప్రమాణం చేయాలని కోరారు. తాను అవినీతి చేసినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని, లేకుంటే పాలిటిక్స్ నుంచి థామస్ తప్పుకోవాలని సవాల్ విసిరారు.

ప్రచార తుఫ్యాన్

జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల క్యాంపెయిన్‌ను శనివారం హోరెత్తించారు. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచే ఇంటింటా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. పోలింగ్ రోజు దగ్గర పడే కొద్దీ ప్రచారాన్ని మరింత ఉధృతం చేశారు. అభ్యర్థుల కుటుంబీకులు కూడా మేము సైతం అంటూ క్షేత్రస్థాయిలో ఓటర్లతో మమేకమవుతూ నీరాజనాలు అందుకున్నారు. గ్రామాల్లో సుడిగాలి పర్యనలు చేస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ.. సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ దూసుకుపోయారు. ఇక కూటమి అభ్యర్థులు మాత్రం ఎన్నికల ప్రచారంలో కాస్త వెనకబడ్డారు. నాయకులకు.. కార్యకర్తలను ఒక్కతాటిపైకి తీసుకురాలేక చివరి రోజు కూడా ముప్పుతిప్పలు పడ్డారు. సమన్వయలోపం.. నోటి దురుసుతో ప్రజల నుంచి తిరస్కారాలు ఎదుర్కొన్నారు.

- జిల్లాలో చివరి రోజు హోరాహోరీగా రాజకీయ పార్టీల క్యాంపెయిన్
- ప్రజల్లోకి దూసుకుపోయిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు
- సకుటుంబ సపరివార సమేతంగా చేపట్టిన ప్రచారానికి నీరాజనాలు
- కపట కూటమి నేతలకు అడుగడుగునా తిరస్కారాలు



చిత్తూరులో వైఎస్సార్‌సీపీ సభకు హాజరైన జనసందోహం (ఇన్‌సెట్) మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, అభివాదం చేస్తున్న ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్



కుప్పం : ర్యాలీలో ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ సతీమణి దుర్గ



పుంగనూరులో వైఎస్సార్‌సీపీ నేతల ర్యాలీ

సాక్షి, చిత్తూరు : సార్వత్రిక ఎన్నికల ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ముందంజలో ఉన్నారు. శనివారం సాయంత్రం 6 గంటల వరకు ప్రచారాలను హోరెత్తించారు. ఈ క్రమంలో కూటమి అభ్యర్థులు వెనకబడ్డారు.

సమరోత్సాహం : ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. మేమంతా సిద్ధం బస్సుయాత్రలో భాగంగాద నియోజకవర్గాల వారీగా బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన కార్యకర్తలు, అభిమానుల్లో సమరోత్సాహం నింపింది.

కుటుంబ సమేతంగా..

ఎన్నికల సందర్భంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఓ వైపు, కుటుంబ సభ్యులు, స్నేహితులు మరో వైపు ముమ్మరంగా ప్రచారాలు నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన సొంత నియోజకవర్గం పుంగనూరుతో పాటు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు కోసం కుప్పం, పలమనేరు, చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరులో ప్రచారం చేశారు. రాజంపేట, చిత్తూరు ఎంపీ అభ్యర్థులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తూ ఓటర్లను నేరుగా కలిసి మద్దతు కూడగట్టారు. అసెంబ్లీ అభ్యర్థుల విషయానికి వస్తే.. నగరిలో మంత్రి ఆర్‌కే రోజాతో పాటు ఆమె భర్త సెల్వమణి, సోదరులు, కుమారుడు, కుమార్తె ప్రచారం నిర్వహించారు. కుప్పంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్‌జే భరత్, తల్లి పద్మజ, సోదరుడు శరత్, సతీమణి దుర్గపద్మిని విస్తృతంగా ప్రచారం చేశారు. పలమనేరులో ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ్, భార్య పావని గౌడ్ ప్రచారం చేశారు. పూతలపట్టులో అభ్యర్థి సునీల్‌కుమార్, కుమార్తె మోన మాన్విత, మేనల్లుళ్లు రాజేష్, ప్రవీణ్, రంజిత్, రాకేష్ ప్రచారం నిర్వహించారు. చిత్తూరులో ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి, ఆయన సతీమణి ఇందుమతి ప్రచారం చేశారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి, ఆమె తండ్రి ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి ఊరూవాడా ప్రచారం చేశారు. ఈ క్రమంలోనే అభ్యర్థుల విజయం కోసం వైఎస్సార్‌సీపీకి చెందిన గ్రామ, వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నాయకుల వరకు అంతా కలిసి కట్టుగా ప్రచారం నిర్వహించారు.



వి.కోట : ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ



రొంపిచెర్లలో బీసీవై అభ్యర్థి ర్యాలీ



జీడీనెల్లూరు : వైఎస్సార్‌సీపీ శ్రేణుల ప్రచారం

అవగాహనతో విధుల నిర్వహణ



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవగాహనతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ఆదేశించారు. శనివారం పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎల్‌ఓలు, సెక్టోరల్, రూట్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 13 వ తేదీన పోలింగ్ నిర్వహణలో బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఏమైనా సందేహాలుంటే ముందస్తుగా తెలుసుకోవాలని తెలిపారు. చిత్తూరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 6 గంటలకు సెక్టోరల్, రూట్ ఆఫీసర్‌లు పీవీకేఎన్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో రిపోర్టు చేసుకోవాలన్నారు. 23 కౌంటర్లు, 4 హెల్ప్‌డెస్కులు, నోటీసుకు బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. 23 మంది సెక్టోరల్, 23 మంది రూట్ ఆఫీసర్‌లు కేటాయించిన కేంద్రాల వద్దకు సమయానికి చేరుకోవాలని కోరారు. విధులకు కేటాయించిన వారు హాజరుకాకపోతే వెంటనే ఆర్‌ఓ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సెక్టోరల్ పరిధిలో ఎన్నికల సామగ్రిని పకడ్బందీగా పరిశీలించుకోవాలని చెప్పారు. 13 వ తేదీ ఉదయం 4 గంటలకల్లా సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాల్లో సిద్ధంగా ఉండాలన్నారు. 5.30 గంటలకు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోలింగ్ నిర్వహించాలని కోరారు. 50 ఓట్లు ముందస్తుగా వేయించి వాటిని బ్లాక్‌కవర్‌లో భద్రపరచాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే సెక్టోరల్ ఆఫీసర్లు, పీఓలు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో ఏఆర్‌ఓలు అరుణ, శ్రీనివాసులురెడ్డి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నీరసించిన తమ్ముళ్లు

రొంపిచెర్ల: మండలంలో టీడీపీ కార్యకర్తలు నీరసించిపోయారు. ఇప్పటి వరకు తమ పార్టీ గెలుపు తథ్యమంటూ బీరాలు పలికిన తమ్ముళ్ల ఇప్పుడు వాస్తవం అర్థం కావడంతో డీలా పడ్డారు. ఓటర్లకు నగదు పంపిణీ చేసినప్పటికీ ప్రజల నుంచి ఆశించిన స్పందన లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఫ్యాన్ గాలి బలంగా వీస్తుండడంతో తట్టుకోలేక ఉక్కపోతకు గురవుతున్నారు.

మరింత బాధ్యతగా విధులు

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ఈ రెండు రోజులు ఎంతో కీలకమని మరింత బాధ్యతగా విధులు నిర్వర్తించాలని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మానిటరింగ్ సెల్‌లో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జరిగే ఎన్నికల పోలింగ్ సరళిని వెబ్‌కాస్టింగ్ విధానంలో పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. సీ విజిల్ యాప్‌లో వచ్చే ఫిర్యాదులకు వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు.

ఎన్నికల సిబ్బందికి రవాణా వసతి

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల పోలింగ్ విధులకు హాజరయ్యే సిబ్బందికి రవాణా వసతి కల్పిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది ఆయా నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ శ్రేణులు



పార్టీలో చేరిన వారితో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చౌడేపల్లె : మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ బండమీదపల్లెకు చెందిన టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీలో చేరాయి. శనివారం ఈ మేరకు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం ఆధ్వర్యంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. ఆయన వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో సుధా, గంగాధరం, శ్రీనివాసులు, అనిల్,కుమార్, ఆనంద తదితరులున్నారు.

పోలింగ్‌కు రండి..ఫ్యాన్‌కు ఓటేయండి



నాగభూషణం కుటుంబసభ్యులతో ఎంపీ మిథున్‌రెడ్డి

పుంగనూరు : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం పోలింగ్‌కు ప్రతి ఒక్కరూ రావాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అభ్యర్థించారు. శనివారం పట్టణంలో పోలింగ్ ఏర్పాట్లపై ఆయన వైఎస్సార్‌సీపీ నేతలతో చర్చించారు. మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ఎండ తీవ్రత కారణంగా ఓటర్లు ఇబ్బంది పడకుండా ఉదయం నుంచే పోలింగ్ సక్రమంగా నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోరారు. ఓటర్లకు మోడల్ ఈవీఎంలతో అవగాహన కల్పించాలని చెప్పారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు ఇబ్బంది పడకుండా పార్టీ నేతలు, కార్యకర్తలు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం కుటుంబ సభ్యులు, పిల్లలతో కాసేపు సరదాగా ముచ్చటించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జి ఫకృద్దీన్‌షరీఫ్, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి పాల్గొన్నారు.

ఓటమి భయంలో ఫేక్ బెట్టింగులు

- రూ.లక్షకు రూ.4 లక్షలంటూ టీడీపీ నేతల పందేలు
- ఓటర్లను మభ్యపెట్టేందుకు పన్నాగాలు
- బాబును నమ్మమంటున్న కుప్పం ప్రజలు



కుప్పం రూరల్ : సుమారు 40 ఏళ్లుగా టీడీపీకి కంచుకోటగా మారిన కుప్పంలో ఈ పర్యాయం వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. కోటకు బీటలు వారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇన్నేళ్లు చంద్రబాబు చెప్పిన మాయమాటలను నమ్మిన ప్రజలు ఇప్పుడు విసిగెత్తిపోయారు. ఎన్నికల సమయంలో బాబు చూపించే కపట ప్రేమ.. కల్లబొల్లి కబుర్లు ఇకపై నడిచేలా లేవు. ఇప్పటి వరకు కుప్పాన్ని సింగపూర్ చేస్తా.. ప్రతి ఒక్కరినీ లక్షాధికారిని చేసేస్తా అంటూ బూటకపు హామీ గుప్పించే బాబును ఈ దఫా కుప్పం వాసులే బురిడీ కొట్టించేందుకు సిద్ధంగా ఉన్నారని స్థానిక పరిస్థితులు గమనిస్తే ఇట్టే అర్థమవుతుంది. ఇది కనిపెట్టిన చంద్రబాబు మరో కొత్త ఎత్తుగడతో ముందుకు వస్తున్నారు. ఫేక్ బెట్టింగ్‌లతో టీడీపీని పైకి లేపేందుకు యత్నిస్తున్నారు.

తమ్ముళ్ల కుయుక్తులు

కుప్పంలో రోజురోజుకూ వైఎస్సార్‌సీపీ ఆదరణ పెరుగుతోంది. ఇది ఓర్వలేని తెలుగు తమ్ముళ్లు కుయుక్తులు పన్నుతున్నారు. అందులో భాగంగా టీ దుకాణాలు, జన సమూహాల మధ్యకు పనిగట్టుకుని వెళ్లి బెట్టింగ్‌లకు దిగుతున్నారు. రూ.లక్షకు రూ.4లక్షలు చెల్లిస్తామంటూ తమలో తామే ఉత్తుత్తి పందేలకు దిగుతున్నారు. ఇదంతా చూసిన వాళ్లు టీడీపీ గెలుస్తుందని ఇంత డబ్బు కడుతున్నారంటే.. ఆ పార్టీకి నిజంగా అంతటి ఆదరణ ఉందా అని ప్రజలు చర్చించుకుంటారని వారి ప్లాన్‌గా తెలుస్తోంది. కుప్పంలో టీడీపీ గెలవబోతోందనే భ్రమను ప్రజల్లో కల్పించేందుకు ఇలా వంచిస్తున్నట్లు సమాచారం. ఎవరైనా తీరా పందెం కాసేందుకు వేరేవారు ముందుకు వస్తే ఇట్టే జారుకుంటున్నారు.